మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

శనివారం SATDAY 29-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 61 Issue: 61


29 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:28 తిథి పాడ్యమి ఉ. 9:55 వరకు తరువాత విదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర తె. 3:310 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం సుకర్మ ఉ. 6:33 వరకు కరణం కౌలవ ఉ. 9:55 వరకు తైతుల రా. 9:47 వరకు వర్జ్యం ఉ. 9:45 నుండి ఉ. 11:23 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:34 వరకు రాహుకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:44 వరకు యమగండం మ. 1:49 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం ఉ. 6:05 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 7:32 నుండి రా. 9:10 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:41 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున




## గ్రాండ్ చెస్ టూర్ విన్నర్.. ప్రజ్ఞానంద

### తొలి భారతీయుడిగా రికార్డు

సెయింట్ లూయిస్: భారత యువ గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద చదరంగంలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను తొలిసారిగా కైవసం చేసుకున్నాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 2 ఫ్యాబియానో కరువానాపై అద్భుతమైన విజయం సాధించాడు. ఈ విజయంతో ఈ టోర్నీని గెలుచుకున్న మొట్టమొదటి భారతీయ ఆటగాడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు.

నిన్న జరిగిన చివరి రోజు ఆటలో ప్రజ్ఞానంద అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించాడు. ఆట ప్రారంభానికి ముందు కరువానా కంటే ఆరు పాయింట్లు వెనుకబడి ఉన్న ప్రజ్ఞానంద, రెండు ర్యాపిడ్ గేమ్‌లలోనూ గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత జరిగిన బ్లిట్జ్ గేమ్‌లలోనూ సమంగా నిలిచి, మొత్తం మీద 15-13 స్కోర్‌తో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన ప్రజ్ఞానందకు 2 లక్షల డాలర్ల (సుమారు రూ. 1.91 కోట్లు) ప్రైజ్ మనీ లభించింది. వాస్తవానికి ఈ టోర్నీ ఆరంభంలో కరువానా చేతిలో తరువాయి 2 వ పేజీలో...




# ఎకరం.. 269 కోట్లు!

### 5.38 ఎకరాల భూమిని దక్కించుకున్న వంశీరాం బిల్డర్స్

### వేలంతో ప్రభుత్వానికి రూ. 1,447 కోట్ల ఆదాయం

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం ఏరియాలో భూముల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. రాయదుర్గం భూములకు అంతకంతకూ డిమాండ్ భారీగా పెరిగిపోతున్నది. ఒకసారి రికార్డ్ ధర అనుకునేలోపే.. రెండు మూడు నెలల్లోనే ఆ రికార్డు బ్రేక్ అయిపోతున్నది. శుక్రవారం (ఆగస్ట్ 28) రాయదుర్గంలోని పాన్ మక్తాలో 5.8 ఎకరాల భూమికి టీజీఐసీసీ వేలం నిర్వహించగా భారీ స్పందన లభించింది.

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): ఎకర రూ. 269 కోట్ల చొప్పున మొత్తం 5.8 ఎకరాల భూమిని వంశీరామ్ బిల్డర్స్ రూ. 1,447 కోట్ల రికార్డ్ ధరకు దక్కించుకుంది. ఇది రిజర్వ్ ధర కంటే 52.3 శాతం అధికం. గత వారం రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని భూములకు నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ. 264 కోట్లు పలికిన విషయం తెలిసిందే. సర్వే నెంబర్ 83/1 లోని ప్లాట్ నంబర్ పీ1లో ఉన్న 5.25 ఎకరాల భూమికి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఐఐసీ) వేలం నిర్వహించింది. కనీస ధరగా ఎకరానికి రూ. 175 కోట్లుగా నిర్ణయించింది. పోటాపోటీగా -2 వ పేజీలో...



# తెలంగాణకు మత్తెక్కింది!

### రాష్ట్రంలో భారీగా పెరిగిన డ్రగ్స్ నేరాలు

### సవాలు విసురుతున్న సాధారణ నేరాలు

### సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు తగ్గుముఖం

### అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్

నేర సమీక్షను కేవలం కాగితాలు, గణాంకాలకే పరిమితం చేయకుండా ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలు, నేరస్థులు అనుసరిస్తున్న పద్ధతులు, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారంపై లోతైన విశ్లేషణ చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన దర్యాప్తు, క్షేత్రస్థాయి పరిశీలన, వృత్తిపరమైన ప్రమాణాల పెంపుతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.




హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన రాష్ట్రంలోని నేర పరిస్థితులు, దర్యాప్తు పురోగతి, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలను సమీక్షించారు. పోలీసు శాఖలో క్షేత్రస్థాయి పరిశీలన, వృత్తిపరమైన ప్రమాణాలను మరింత పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తూ సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్) డేటా నవీకరణను 70 శాతం నుంచి 96 శాతానికి పెంచడంపై డీజీపీ అధికారులను అభినందించారు. ఇకపై ప్రతి నెలా నేర సమీక్ష సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు తనిఖీ నివేదికలను పరిశీలిస్తూ పోలీస్‌స్టేషన్ల తనిఖీలను మరింత విస్తృతం తరువాయి 2 వ పేజీలో...



## బస్సుల్లో ఇకపై 'సెల్ఫ్ టికెటింగ్'

### క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు

### నల్గొండ-హైదరాబాద్ మార్గంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల సౌకర్యార్థం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాన్‌స్టాప్ బస్సు సర్వీసుల్లో 'సెల్ఫ్ టికెటింగ్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. బస్సు ఎక్కే ముందు టికెట్ కోసం వేచి చూసే అవసరం లేకుండా, ప్రయాణికులే స్వయంగా టికెట్ కొనుగోలు చేసేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించింది.

నల్గొండ, ఆగస్టు 28 (ఈవార్తలు): ఈ విధానంలో భాగంగా ప్రయాణికులు బస్సు ఎక్కే ముందు డోర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను తమ స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. అనంతరం తాము ఎక్కే, దిగే స్టాప్‌ల వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించగానే టికెట్ జనరేట్ అవుతుంది. ఆ డిజిటల్ టికెట్‌ను డ్రైవర్‌కు చూపిస్తే సరిపోతుంది. ప్రయోగాత్మకంగా-2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,298 |
| వెండి (కిలో): | రూ.2,65,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,658 |

# ఆర్టీసీ 'స్పెషల్' వడ్డింపు

### 50 శాతం టికెట్ చార్జీల పెంపు.. 1981 జీవో ప్రకారమే: అధికారులు

పండుగలు వస్తే ప్రజలు ఆనందంగా తమ సొంతూళ్లకు వెళ్లాలి. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవాలి. కానీ, రాఖీ పండుగ వంటి సందర్భాల్లో తెలంగాణ ఆర్టీసీ అనుసరిస్తున్న ప్రత్యేక బస్సుల చార్జీల విధానం ప్రయాణికులకు ఆనందం కంటే ఆర్థిక భారంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు రూ.290 వరకు ఉండే ప్రయాణ చార్జీ, పండుగ రద్దీ పేరుతో స్పెషల్ బస్సుల్లో రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా పెరగడం ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. కొన్ని మెట్రో డీలక్స్ స్పెషల్ బస్సుల్లో రూ.400 వరకు వసూలు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): పండుగ సమయంలో అదనపు బస్సులు నడపడం, రద్దీని నియంత్రించడం ఆర్టీసీ బాధ్యతే. కానీ ఆ సేవకు బదులుగా ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపడం ఎంతవరకు సమంజసం? పండుగ రోజుల్లోనే ప్రజలకు ఎక్కువ రవాణా అవసరం ఉంటుంది. ఇదే అవసరాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని తరువాయి 2 వ పేజీలో...



# మాకొద్దు.. భారత్ సాయం

### నేపాల్ సర్కారు కీలక నిర్ణయం

### విదేశీ రెస్క్యూ బృందాల సాయం తిరస్కరణ

ఖట్మండు: భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్ కీలక నిర్ణయం తీసుకుంది. గల్లంతైనవారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యల్లో విదేశీ రెస్క్యూ బృందాల సాయం తీసుకోకూడదని నిర్ణయించింది. తమ భద్రతా బలగాలే సహాయక చర్యలు చేపట్టగలవని స్పష్టం చేసింది. భారత్, చైనా సహా పలు దేశాలు పంపిన సహాయ ప్రతిపాదనలను తిరస్కరించింది. బుధవారం భోటేకోషి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలో భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో తరువాయి 2 వ పేజీలో...

**320 మంది ఆచూకీ దొరకలేదు: విదేశాంగ శాఖ**

## విశ్వవాణి




ఇంటర్నెట్ వేగంలో జపాన్ శాస్త్రవేత్తలు సరికొత్త రికార్డు సృష్టించారు. జపాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ పరిశోధకులు ఆప్టికల్ ఫైబర్ ద్వారా సెకనుకు 1.02 పెటాబిట్ల డేటా ప్రసార వేగాన్ని సాధించారు. ఇది దాదాపు 102 కోట్ల మెగాబిట్ల వేగానికి సమానం. ఈ వేగంతో సిద్ధాంతపరంగా నెట్‌ఫ్లిక్స్‌లోని మొత్తం కంటెంట్‌ను సుమారు ఒక్క సెకనులోనే డౌన్‌లోడ్ చేయవచ్చని పరిశోధకులు తెలిపారు.

# ఇంటర్ అర్హతతో 15,982 ఉద్యోగాలు

### సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం తరువాయి 2 వ పేజీలో...





# 1 నుంచి 'విదేశీ' దరఖాస్తులు

### పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు అవకాశం

### సద్వినియోగం చేసుకోవాలి: బీసీ సంక్షేమశాఖ

తెలంగాణకు చెందిన బీసీ, ఈబీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సువర్ణావకాశం కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2026 ఆగస్ట్, సెప్టెంబర్ ఫాల్ సెషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ సూచించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు.. 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం తరువాయి 2 వ పేజీలో...




# సీఎన్జీ ధర రూ.3.89 పెంపు

న్యూఢిల్లీ: ఆటోలు, క్యాబ్‌లు, అలాగే తక్కువ ఖర్చుతో వ్యక్తిగత వాహనాలు నడిపే వారికి మరోసారి భారం పెరగనుంది. ఎందుకంటే.. ఆగస్టు 29 నుంచి సీఎన్జీ ధర కిలోకు రూ. 3.89 పెరగనుంది. శుక్రవారం రాత్రి ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ఈ విషయాన్ని ప్రకటించింది. దీంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో సీఎన్జీ ధర కిలోకు రూ. 86.98కు చేరనుంది. -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

29.8.2026

మేషం: వ్యాపార వ్యవహారాలలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆర్థిక విషయాలు నిరాశాజనకంగా సాగుతాయి. మాతృ సంబంధిత అనారోగ్యములు కొంత బాధిస్తాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది.

వృషభం: స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. మిత్రులతో సభ, సమావేశాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది.

మిధునం: వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ధనపరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

సింహం: నిరుద్యోగులకు మానసిక ఒత్తిడి తప్పదు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు మరింత బాధిస్తాయి. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణ సూచనలున్నవి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు.

తుల: వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

వృశ్చికం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగాలలో సమస్యలు అధిగమించి ముందుకు సాగుతారు. నూతన వాహనయోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

ధనస్సు: దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. చిన్ననాటి మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ముఖ్య వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు తప్పవు.

మకరం: వ్యాపార ఉద్యోగాలలో అనుకున్న మార్పులు చోటుచేసుకుంటాయి. ఆత్మీయుల నుంచి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. పాత ఋణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: బంధువులతో శుభకార్య విషయమై చర్చలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యడం మంచిది. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు.

# తెలంగాణకు మత్తెక్కింది!

మొదటి పేజీ తరువాయి

చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని స్పష్టం చేశారు.

### తగ్గిన తీవ్ర నేరాలు.. పెరిగిన మాదకద్రవ్య కేసులు

రాష్ట్రంలో తీవ్ర నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు తగ్గుముఖం పట్టడం కొంత ఊరటనిచ్చినప్పటికీ మాదకద్రవ్యాలు, సాధారణ నేరాలు, ట్రాఫిక్ నేరాల పెరుగుదల పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో తీవ్ర నేరాలు 10.33 శాతం తగ్గగా, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ తగ్గుదల 26.23 శాతంగా నమోదైంది. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. మహిళలు, చిన్నారులపై నేరాలు కూడా 1.54 శాతం తగ్గినట్లు డీజీపీ వెల్లడించారు. అయితే మూడేళ్ల వ్యవధిలో మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు 46.10 శాతం పెరగడం ఆందోళన కలిగించే అంశంగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సైబరాబాద్‌లో 90.98 శాతం, వరంగల్‌లో 142.31 శాతం పెరుగుదల నమోదైంది. వ్యవస్థీకృత నేరాలు మూడేళ్లలో 25 నుంచి 451 కేసులకు పెరిగాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం పెరిగి 2,84,363కు చేరింది. ట్రాఫిక్ నేరాలు 9.48 శాతం పెరిగాయి.

### గిరిజన జిల్లాలపై ప్రత్యేక దృష్టి

చిన్న, గిరిజన జిల్లాలైన ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నేరాల రేటు పెరుగుతుండటంపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా జిల్లాల్లో నేరాల పెరుగుదలకు కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్ అనువర్తనాలు, టీజీ-కాప్, హాక్-ఐ, ఐసీజేఎస్, ఈగల్ కార్యకలాపాలపై అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. యువ ఐపీఎస్ అధికారులు చేపట్టిన సాంకేతిక ఆవిష్కరణలు, లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస చర్యలను కూడా డీజీపీ సమీక్షించారు. సమయానుకూలంగా డేటాను విశ్లేషించడం, ప్రాథమిక పోలీసింగ్‌ను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయగలమని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. సమావేశంలో డీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు పోలీసు కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

### నేర గణాంకాలు.. కీలక వివరాలు

| నేర విభాగం | మార్పు |
|---|---|
| రాష్ట్రంలో మొత్తం నేరాలు | 7.15% పెరుగుదల |
| మొత్తం నేరాల సంఖ్య | 2,84,363 |
| తీవ్ర నేరాలు | 10.33% తగ్గుదల |
| హైదరాబాద్‌లో తీవ్ర నేరాలు | 26.23% తగ్గుదల |
| సైబర్ నేరాలు | 13.29% తగ్గుదల |
| ఆర్థిక నేరాలు | 13.28% తగ్గుదల |
| మహిళలు, చిన్నారులపై నేరాలు | 1.54% తగ్గుదల |
| మాదకద్రవ్య కేసులు (3 ఏళ్లలో) | 46.10% పెరుగుదల |
| సైబరాబాద్‌లో మాదకద్రవ్య కేసులు | 90.98% పెరుగుదల |
| వరంగల్‌లో మాదకద్రవ్య కేసులు | 142.31% పెరుగుదల |
| వ్యవస్థీకృత నేరాలు | 25 నుంచి 451కి పెరుగుదల |
| ట్రాఫిక్ నేరాలు | 9.48% పెరుగుదల |
| సీసీటీఎన్ఎస్ డేటా నవీకరణ | 70% నుంచి 96%కి పెరుగుదల |



# మాకొద్దు.. భారత్ సాయం

మొదటి పేజీ తరువాయి

మట్టి, శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 469 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు వెయ్యి మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. భారత్, చైనా, అమెరికా, బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, శ్రీలంక, బంగ్లాదేశ్ సహా పలు దేశాలు రెస్క్యూ సిబ్బందిని పంపేందుకు ముందుకొచ్చాయి. వందలాది మంది భారతీయులు గల్లంతైన నేపథ్యంలో 'భారత్ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం'(ఎన్‌డీఆర్ఎఫ్)ను పంపేందుకు అనుమతి కోరింది. నేపాల్ ఆ ప్రతిపాదనను కూడా తిరస్కరించింది. 2015 భూకంపం సమయంలో పెద్ద సంఖ్యలో విదేశీ రెస్క్యూ బృందాలు రావడంతో సమన్వయం, నిర్వహణలో ఇబ్బందులు ఎదురైన అనుభవం ఈ నిర్ణయానికి కారణమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విదేశీ బృందాల బదులు ఆర్థిక సాయాన్ని ఒకే వ్యవస్థ ద్వారా అందించాలని నేపాల్ కోరుతోంది. నేపాల్ పోలీసులు 4,348 మందిని సహాయక చర్యల్లో మోహరించారు. రసువా నుంచి 644 మంది, నువాకోట్ నుంచి 898 మంది, ధాదింగ్ నుంచి ముగ్గురిని రక్షించారు. గల్లంతైనవారిలో విదేశీయులు కూడా ఉన్నారు. 178 మంది భారతీయులు, 65 మంది అమెరికన్లు, 51 మంది మలేషియన్లు, 53 మంది ఉక్రెయిన్ వాసులు, 33 మంది బ్రిటన్ పౌరులు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 25 మంది కెనడా పౌరుల ఆచూకీ తెలియడం లేదు. అయితే ఆర్థిక, మానవతా సాయాన్ని నేపాల్ స్వీకరిస్తోంది. అమెరికా 5 లక్షల డాలర్ల సాయం ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర వైద్య సామగ్రిని పంపింది. విదేశీ పౌరుల సమాచారం, సహాయక చర్యల కోసం నేపాల్ విదేశాంగ శాఖ అత్యవసర నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

# సీఎన్జీ ధర రూ.3.89 పెంపు

మొదటి పేజీ తరువాయి




కొత్త ధరలు ఆగస్టు 29 ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వస్తాయి. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు పెరగడం వల్లే ఈ ధరల పెంపునకు ప్రధాన కారణం అని ఐజీఎల్ స్పష్టం చేసింది. గ్యాస్ కొనుగోలు ఖర్చు పెరుగుతుండటంతో.. దాని ప్రభావం సంస్థపై పడుతోందని.. ఈ అదనపు ఖర్చును కొంతవరకు భర్తీ చేసుకునేందుకు కిలోకు రూ.3.89 మేర ధర పెంచాల్సి వచ్చిందని కంపెనీ వివరించింది. సీఎన్‌జీ ధర పెరగడంతో ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, క్యాబ్ సర్వీస్ నిర్వాహకులు, రోజువారీ ప్రయాణాలకు సీఎన్‌జీ వాహనాలను ఉపయోగించే వారికి ఖర్చు పెరగనుంది. ఇంధన ధరల పెంపు రవాణా ఖర్చులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే సీఎన్‌జీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా.. నిరంతరంగా సరఫరా కొనసాగుతుందని పేర్కొంది.

# 1 నుంచి 'విదేశీ' దరఖాస్తులు

మొదటి పేజీ తరువాయి

అందిస్తోంది. విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్లాలనే కల ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు నిర్దేశించిన అర్హతలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఈ మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 30వ తేదీ చివరి తేదీ కావడంతో చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే అప్లికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి కలిపి రూ.5 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తు చేసే సమయానికి అభ్యర్థి వయస్సు 35 ఏళ్లకు మించకూడదని రూల్ పెట్టింది. ఈ మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థి గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని.. దీంతో పాటు విదేశీ విద్యకు అవసరమైన పరీక్షల్లో నిర్దేశించిన స్కోర్ కూడా ఉండాలి.

# గ్రాండ్ చెస్ టూర్ విన్నర్.. ప్రజ్ఞానంద

మొదటి పేజీ తరువాయి

తొలి క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞానంద ఓడిపోయాడు. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో చివరి రోజు ఆటలో వెనుకబడినప్పటికీ, అద్భుత ప్రదర్శనతో విజయాన్ని అందుకున్నాడు. ఇదే టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జీఎం వెస్లీ సో, విన్సెంట్ కైమర్‌పై విజయం సాధించాడు.

# ఎకరం.. 269 కోట్లు!

మొదటి పేజీ తరువాయి

సాగిన వేలంలో ఎంఎస్ ఎన్ రియాల్టీ అనే సంస్థ భూమిని దక్కించుకుంది. ఎకరానికి రూ.264 కోట్లు పాడింది. మొత్తంగా 5.25 ఎకరాల భూమిని ఆ సంస్థే దక్కించుకోగా.. టీజీఐఐసీకి రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది.

ఇది రిజర్వ్ ధర కన్నా 51 శాతం అధికం కావడం విశేషం. ఇదిలా ఉండగానే.. వారం రోజుల్లోనే ఈ రికార్డ్ కూడా బ్రేక్ అయ్యింది. శుక్రవారం (ఆగస్ట్ 28) రాయదుర్గంలోని పాన్ మక్తాలో 5.8 ఎకరాల భూమికి టీజీఐఐసీ వేలం నిర్వహించగా భారీ స్పందన లభించింది. పోటాపోటీగా సాగిన వేలంలో ఎకర రూ.269 కోట్ల చొప్పున మొత్తం 5.8 ఎకరాల భూమిని వంశీరామ్ బిల్డర్స్ రూ.1,447 కోట్ల రికార్డ్ ధరకు దక్కించుకుంది. ఇది రిజర్వ్ ధర కంటే 52.3 శాతం అధికం. రాయదుర్గంలోని 10.63 ఎకరాల భూమికి రెండుసార్లు జరిగిన వేలం ద్వారా ప్రభుత్వానికి ఏకంగా రూ.2,833.22 కోట్ల ఆదాయం సమకూరింది.ా1 ద్వారా రూ.1,386 కోట్ల ఆదాయం రాగా,ా2 వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,447.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఎకరాకు సగటున రూ.266.53 కోట్లు పలికింది. భూమి రికార్డ్ ధర పలకడం రాయదుర్గం కారిడార్‌పై పెట్టుబడిదారుల భారీ ఆసక్తికి నిదర్శనమని అధికారులు అంటున్నారు. హైదరాబాద్ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, జాతీయ స్థాయి డెవలపర్ల విశ్వాసం ఎంతగా పెరిగిందో స్పష్టమవుతోందని అంటున్నారు. రాయదుర్గంలో భూముల విలువ వేగంగా పెరుగుతున్నదనడానికి ఈ వేలం మరో ఉదాహరణగా నిలిచిందన్నారు.




# ఆర్టీసీ 'స్పెషల్' వడ్డింపు

మొదటి పేజీ తరువాయి

ఇష్టానుసారంగా చార్జీలు పెంచడం ప్రజాసేవా సంస్థకు తగిన చర్య కాదనే ప్రశ్న తలెత్తుతోంది. "1:50 రూల్" పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నామని చెబుతున్నా, ఆ విధానం గురించి ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉందా? అనే సందేహం ఉంది. మరోవైపు, స్పెషల్ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కిన తర్వాత మార్గమధ్యంలో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బస్సు ఎక్కే ముందు టికెట్ ధర ఎంత? సాధారణ చార్జీ ఎంత? అదనపు చార్జీ ఎంత? ఎందుకు వసూలు చేస్తున్నారు? వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉంది. ప్రయాణికుడికి ఆప్షన్ చూపించకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా అదనపు చార్జీలు వసూలు చేస్తే అది పారదర్శకతకు విరుద్ధం. జర్నలిస్టులకు వర్తించే 1/3 రూల్ స్పెషల్ బస్సుల్లో ఎందుకు వర్తించడం లేదన్న ప్రశ్నకు కూడా స్పష్టమైన సమాధానం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. ఒకే సంస్థలో ఒకే నిబంధన సాధారణ బస్సుల్లో ఒకలా, స్పెషల్ బస్సుల్లో మరోలా అమలవుతుందా? అయితే దానికి సంబంధించిన స్పష్టమైన నిబంధనలు ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదు? ఆర్టీసీ నష్టాల్లో ఉందని, అదనపు సర్వీసుల నిర్వహణకు ఖర్చులు ఉంటాయని సంస్థ వాదించవచ్చు. కానీ ప్రజాసేవా సంస్థగా లాభం కోసం పండుగల రద్దీని పూర్తిగా 'క్యాష్' చేసుకోవడం సరైన విధానం కాదు. పండుగకు ఇంటికి వెళ్లడం ప్రజల విలాసం కాదు.. వారి అవసరం. ఆ అవసరాన్ని అవకాశంగా మార్చుకుని జేబులకు చిల్లు పెట్టడం కంటే, సాధారణ చార్జీలతో అదనపు బస్సులు నడిపి ప్రయాణికులకు ఊరట కల్పించాలి. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పెషల్ బస్సుల చార్జీల విధానాన్ని సమీక్షించాలి.అయితే, ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ఇంటర్ అర్హతతో 15,982 ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# బస్సుల్లో ఇకపై 'సెల్ఫ్ టికెటింగ్'

మొదటి పేజీ తరువాయి

ఈ స్మార్ట్ టికెట్ విధానాన్ని తొలుత నల్గొండ-హైదరాబాద్ మార్గంలో అమలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ రూట్‌లో ప్రస్తుతం 45 డీలక్స్ నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ఇక్కడ ఈ విధానం విజయవంతమైతే, సెప్టెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని మిగతా అన్ని నాన్‌స్టాప్ రూట్లలోనూ విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త విధానం వల్ల ప్రయాణికులకు చిల్లర సమస్య తీరడంతో పాటు సమయం ఆదా అవుతుందని ఆర్టీసీ భావిస్తోంది. అదే సమయంలో డ్రైవర్లపై టికెట్లు జారీ చేసే పనిభారం కూడా తగ్గుతుంది. అయితే, స్మార్ట్‌ఫోన్‌లు లేనివారు, డిజిటల్ చెల్లింపులపై అవగాహన లేని ప్రయాణికులు యథావిధిగా డ్రైవర్ వద్దే టికెట్ కొనుగోలు చేయవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ సెల్ఫ్ టికెటింగ్ విధానం కోసం 'మీ సేవ'కు చెందిన 'మీ టికెట్'తో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

## 320 మంది ఆచూకీ దొరకలేదు: విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: నేపాల్ వరదల్లో భారతీయుల గల్లంతుపై భారత విదేశాంగశాఖ కీలక ప్రకటన చేసింది. విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. నేపాల్ వరదల్లో 320 మంది భారతీయులు గల్లంతయ్యారని అన్నారు. చైనాలో ఉన్న 400 మంది భారతీయులు క్షేమంగా ఉన్నారని ప్రకటించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, స్పష్టం చేశారు. చైనాలో చిక్కుకుపోయిన పౌరులను స్వదేశానికి తరలించేందుకు భారత అధికారులు, స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. బీజింగ్ లోనూ భారత రాయబార కార్యాలయం నిర్వహిస్తున్న హెల్ప్ లైన్ నంబర్ల ద్వారా బాధితుల కుటుంబ సభ్యులు చాలా మంది తమకు సంప్రదించారన్నారు. పౌరులను తరలించేందుకు బీజింగ్ లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటుందని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతం నుండి గురువారం కాఠ్మండుకు 21 మంది భారతీయులు చేరుకున్నారని, వారు శుక్రవారం ఢిల్లీలో దిగారని చెప్పారు.



# నేపాల్ వరదల్లో తెలుగు ఎన్నారై కుటుంబం గల్లంతు

విజయనగరం/ఖట్మండు: ఏపీలోని విజయనగరం జిల్లా పార్వతీపురం పట్టణానికి చెందిన ఒక ప్రవాసాంధ్ర (ఎన్నారై) కుటుంబం నేపాల్ వరద నీటిలో గల్లంతవ్వడం తీవ్ర శోకాన్ని నింపింది. పార్వతీపురం పండా వీధికి చెందిన సుభాష్ చంద్ర సాహూ పెద్ద కుమారుడు సంతోష్ కుమార్ సాహూ (47) గత 20 ఏళ్లుగా లండన్‌లో స్థిరపడ్డారు. తాజాగా ఆయన తన భార్య సురభి (43), కుమారుడు స్పందన్ (18), కుమార్తె సైనా (13)లతో కలిసి లండన్ నుంచి నేపాల్ మార్గంలో మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. యాత్రలో భాగంగా వీరంతా ప్రయాణిస్తున్న వాహనం ఓ వంతెన దాటుతుండగా ఒక్కసారిగా విరుచుకుపడిన వరద ఉధృతికి ఊహించని రీతిలో వంతెన కొట్టుకుపోయింది. ఈ విషాద సమాచారాన్ని స్థానిక నేపాల్ గైడ్ సంతోష్ బంధువులకు అందించాడు. ఇప్పటివరకు ఆ వాహనం గానీ, కుటుంబ సభ్యుల ఆచూకీ గానీ లభించకపోవడంతో బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సంతోష్ తల్లిదండ్రులు ప్రస్తుతం సౌతాఫ్రికాలో ఉంటున్న తమ రెండో కుమారుడి వద్ద ఉండగా, బిడ్డలు, మనవళ్లు ఆకస్మిక ప్రళయంలో గల్లంతయ్యారన్న వార్త విని కన్నీరుమున్నీరవుతున్నారు.

## మంత్రి పొన్నంకు 'సర్' నోటీసులు

హుస్నాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే. ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

## కామారెడ్డిలో సు'రక్షాబంధన్'

కామారెడ్డి, ఆగస్టు 28 (ఈవార్తలు): రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించకుండా, మానవతా దృక్పథంతో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. శుక్రవారం రక్షా బంధన్ వేడుకల సందర్భంగా, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని మహిళా ట్రాఫిక్ పోలీసులు నిలిపివేశారు. వారికి చలాన్లు విధించకుండా, నుదుటన తిలకం దిద్ది, చేతికి రాఖీలు కట్టారు. "అన్నయ్యా, హెల్మెట్ ధరించండి. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది" అంటూ ఆప్యాయంగా చెప్పారు. హెల్మెట్ ధరించడాన్ని ఒక బాధ్యతగా, అలవాటుగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. "రక్షా బంధన్ – సురక్షా బంధన్" పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా, హెల్మెట్ ధరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదని, అది మన ప్రాణాలను కాపాడే రక్షణ అని పోలీసులు నొక్కిచెప్పారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాంతకమైన తల గాయాల నుంచి హెల్మెట్ రక్షణ కల్పిస్తుందని వారు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, హెల్మెట్ వాహనదారుడికి ఒక రక్షణ కవచం వంటిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల క్షేమాన్ని కాంక్షించి, సురక్షితంగా ప్రయాణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. భవిష్యత్తులో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని పలువురు వాహనదారులు పోలీసులకు హామీ ఇచ్చారు.

## మూడేళ్ల కొడుకును బ్రిడ్జిపైనే వదిలి..!

**గోదావరిలో దూకేసిన దంపతులు**

భీమవరం, ఆగస్టు 28 (ఈవార్తలు): మూడేళ్ల కుమారుడిని గోదావరి నది బ్రిడ్జిపై ఒంటరిగా వదిలేసి, దంపతులు నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, భీమవరానికి చెందిన దొడ్డ సాయి (29), దొడ్డ శిరీష (28) దంపతులు గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తమ మూడేళ్ల కుమారుడితో కలిసి స్కూటర్‌పై గోదావరి నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్నారు. అనంతరం, కన్నకొడుకును అక్కడే వదిలేసి, ఇద్దరూ నదిలోకి దూకేశారు. వంతెనపై పసిబాలుడు ఒంటరిగా ఏడుస్తుండటాన్ని గమనించిన అటుగా వెళుతున్న ప్రయాణికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, బాలుడిని సురక్షితంగా తమ సంరక్షణలోకి తీసుకున్నారు. దంపతులు వదిలివెళ్లిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే స్థానిక ఈతగాళ్లు, సహాయక సిబ్బంది సహకారంతో గోదావరి నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. దంపతుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే, వారు ఈ దారుణ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారిని విచారించి వివరాలు సేకరిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వారు బలవన్మరణానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. దొడ్డ సాయి ఓ ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్ గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు, ప్రస్తుత ఉదంతానికి ఎటువంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే గానీ ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఏడుగురు ఏపీ మత్స్యకారులు సేఫ్

**25 రోజుల తర్వాత సురక్షితంగా ఇళ్లకు**

కోనసీమ జిల్లా, ఆగస్టు 28 (ఈవార్తలు): దాదాపు 25 రోజుల ఉత్కంఠకు తెరపడింది. ఈ నెల ప్రారంభంలో సముద్రంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారులు శుక్రవారం సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకున్నారు. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఈ మత్స్యకారుల రాకతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పశ్చిమ బెంగాల్ తీరంలో క్షేమంగా ఉన్నట్లు తేలడంతో అధికారులు వారిని కాకినాడకు తీసుకువచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే వి. కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్, జిల్లా అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. వివరాల్లోకి వెళితే.. కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ పాయింట్ నుంచి ఆగస్టు 3న ఏడుగురు మత్స్యకారులు మెకనైజ్డ్ బోటులో వేటకు బయలుదేరారు. టూనా చేపల కోసం ఆంధ్ర తీరానికి దూరంగా సముద్రంలోకి వెళ్లిన వీరు, ఆగస్టు 7 నుంచి కుటుంబసభ్యులతో సంబంధాలు కోల్పోయారు. వాస్తవానికి ఆగస్టు 12న తిరిగి రావాల్సి ఉండగా, ఎంతకీ రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అధికారులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం, బంగాళాఖాతంలో భారీ గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ), నేవీ, ఇతర శాఖల సమన్వయంతో గాలింపును ముమ్మరం చేశారు. ఈ ఆపరేషన్‌లో 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లు పాల్గొన్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పశ్చిమ బెంగాల్ తీరానికి సమీపంలోని శంఖర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ వద్ద స్థానిక మత్స్యకారులు గల్లంతైన జాలర్ల బోటును గుర్తించారు. స్థానిక జాలర్లు తమ సెల్‌ఫోన్‌ను ఇవ్వడంతో, ఏపీలోని తమ కుటుంబసభ్యులతో మాట్లాడి తాము క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించారు. బోటు ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో సముద్రంలో చిక్కుకుపోయామని బాధితులు తెలిపారు. బెంగాల్ తీరానికి చేరడానికి ముందు మూడు రోజులకు పైగా ఆహారం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడ్డామని వారు తమ ఆవేదనను వెలిబుచ్చారు. గల్లంతైన వారిలో కోపనాతి రామకృష్ణ, కొల్లాటి ఏసుదాసు, పాలెపు శాంతారావు, కొల్లాటి శ్రీనుబాబు, కర్రి రాంబాబు, సంగని తాతారావు, కటాది సతీష్ కుమార్ ఉన్నారు. వారు ప్రాణాలతో తిరిగి రావడంతో వారి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# రేవంత్.. మీ తాత జాగీరు కాదు

**రేషన్ కార్డుల్లో ఫొటోపై ఈటల మండిపాటు**



హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.




## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నాగబాబు బాధ్యతలు

మంగళగిరి, ఆగస్టు 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## వైద్య పరీక్షల పేరుతో సర్కారు డ్రామా: కవిత



హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## రేవంత్‌కు కొండా సురేఖ రాఖీ

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## అంబటి రాంబాబుకు స్టెంట్



హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్: దావ వసంత

జగిత్యాల, ఆగస్టు 28 (ఈవార్తలు): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల మాజీ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ చల్లాల్ గ్రామంలోని నూతనంగా ప్రతిష్ఠించిన ముద్ద వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సోదరీమణులు, సోదరులతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దావ వసంత చల్ గల్ సర్పంచ్ జున్ను రాజేందర్ తో పాటు పలువురికి రాఖీ కట్టి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ఉన్న ఆప్యాయత, అనుబంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. రక్షాబంధన్ మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలను ప్రతిబింబించే పవిత్రమైన పండుగ అని అన్నారు. జగిత్యాల జిల్లా, నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్‌రావు, చల్ గల్ గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్, నాయకులు పడిగేలా గంగారెడ్డి, ఆనంద్‌రావు, ఎల్ల రాజన్న, చెట్లపెల్లి సత్యం, ప్రవీణ్‌గౌడ్, బాలే చందు, యాళ్ల మహేష్, బొల్లరపు ముత్యం, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ అర్వింద్‌కు రాఖీ కట్టిన భోగ శ్రావణి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురిని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. బోగ శ్రావణి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ ధర్మపురికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా అర్వింద్ ధర్మపురి అన్నకు రాఖీ కట్టి, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, మరిన్ని విజయాలు సాధించాలని డా. బోగ శ్రావణి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, సింగం పద్మ, గడ్డల లక్ష్మి, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## రాఖీ పౌర్ణమి వేళ ధనలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, ఆగస్టు 28 (ఈవార్తలు): శ్రావణ మాస రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో గల శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, తులసీదళాభిషేకం నిర్వహించారు. లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, అమ్మవారి నిజరూప దర్శనం, పూల అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. పారాయణం అనంతరం భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి, ముడుపులు కట్టారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వారా ముగ్గురు భక్తులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ పూజారి శ్రీహరి ఆశీర్వచనాలతో భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి భారతాల సాగర్–గీత, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, కావ్యశ్రీ, ప్రియాంక, సుశీల, గంగమ్మ, జమున, శోభ తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్టు

కోరుట్ల, ఆగస్టు 28 (ఈవార్తలు): కోరుట్ల పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో క్యాషియర్‌పై దాడి చేసి హత్యకు యత్నించిన కేసులో రౌడీషీటర్‌ను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బింగి అలియాస్ బంగి నగేష్ (24) ఈ ఘటనకు పాల్పడ్డాడు. ఈ నెల 27న రాత్రి 9.30 గంటల సమయంలో మనీబార్ అండ్ రెస్టారెంట్‌లో బీర్ ఇవ్వాలని క్యాషియర్‌ను నిందితుడు దుర్భాషలాడాడు. దీనిపై క్యాషియర్ ప్రశ్నించడంతో ఆగ్రహించిన నగేష్ తన చేతికి ఉన్న స్టీల్ కడియంతో అతని ముఖంపై దాడి చేసి గాయపరిచాడు. అనంతరం బీర్ బాటిల్‌తో తలపై కొట్టేందుకు ప్రయత్నించగా బాధితుడు తప్పించుకున్నాడు. ఈ ఘటనను ప్రత్యక్ష సాక్షులు గమనించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 28న నగేష్‌ను కోరుట్లలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి దాడికి ఉపయోగించిన స్టీల్ కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయస్థానంలో హాజరుపరిచారు. గతంలో పలు కేసులు నిందితుడు నగేష్‌పై గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అతనిపై రౌడీషీట్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. రౌడీషీటర్లు, నేరస్తులు ప్రజలను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోరుట్ల పోలీసులు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, బెదిరింపులకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, అక్రమంగా మద్యం లేదా ఇతర వస్తువులు తీసుకోవడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



## సీఎంకు అడువాల జ్యోతి రాఖీ

హైదరాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీఎంకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్‌కు ముందు శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నెలకొనాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా సుఖశాంతులతో, సౌభాగ్యాలతో జీవించాలని కోరుకున్నారు.



## నేటి నుంచి భూ భారతి రీ-సర్వే

గంగాధర, ఆగస్టు 28 (ఈవార్తలు): గంగాధర, మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో భూ భారతి రీ–సర్వేపై అవగాహన సదస్సును గ్రామ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల తహసీల్దార్ రజిత హాజరై రైతులకు రీ–సర్వేపై అవగాహన కల్పించారు. శనివారం నుంచి సర్వే బృందాలు సర్వే నంబర్ల వారీగా గ్రామంలో పర్యటించి భూముల రీ–సర్వే చేపడతాయని తహసీల్దార్ తెలిపారు. సర్వే బృందం వచ్చిన సమయంలో రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూమికి సంబంధించిన ఇతర ఆధారాలతో తప్పనిసరిగా మోకాపై ఉండాలని సూచించారు. సర్వే అధికారులకు రైతులు, ప్రజలు, గ్రామ పాలకవర్గం సహకరించాలని కోరారు. రీ–సర్వే ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, డీఐ రమణయ్య, మండల సర్వేయర్ కుమార్, ఆర్ఐ రాజ్‌కుమార్, స్థానిక జీపీఓ, ఇస్లాంపూర్ గ్రామ పాలకవర్గ సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్స్‌తో పేదలకు నాణ్యమైన విద్య

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



జగిత్యాల, ఆగస్టు 28 (ఈవార్తలు: అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మించనున్న పాఠశాల పనులను శుక్రవారం ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిని ఒకే ప్రాంగణంలో అందించడమే యంగ్ ఇండియా స్కూల్స్ ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠశాలలో 2,500 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య అందుతుందని తెలిపారు. హాస్టల్, లైబ్రరీ, ల్యాబ్స్, కంప్యూటర్, క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జగిత్యాలకు ఈ పాఠశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, మాజీ జెడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, పెండెం రాములు, మాజీ సర్పంచులు నక్కల రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ షాదబ్ హాకీం, ఏఈలు శశి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సంజయ్‌కు రాఖీ కట్టిన జ్యోతి

జగిత్యాల టౌన్, ఆగస్టు 28 (ఈవార్తలు): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నివాసంలో రాఖీ వేడుకలు ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి ఎమ్మెల్యేను కలిసి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని జ్యోతి అన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సంజయ్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా జ్యోతికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలను గౌరవిస్తూ సమాజంలో సోదరభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

## ఏపీలో జర్నలిస్టు అవార్డుల పేర్లు మార్పు

విజయవాడ, ఆగస్టు 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు అందించే పలు పురస్కారాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో నిర్ణయించిన కొన్ని అవార్డుల పేర్లపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఆ మేరకు నిన్న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల ద్వారా పలువురు ప్రముఖుల పేర్లను ఈ పురస్కారాలకు జత చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన అవార్డుల వివరాలు ఇలా ఉన్నాయి: బి. నాగేశ్వరరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు పేరును "కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు"గా మార్చారు. ఖాసా సుబ్బారావు, ఎం. నర్సింగరావు, షోయబుల్లా ఖాన్ ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డుల పేర్లను "ఖాసా సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు"గా సవరించారు. ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డుకు ప్రముఖ సంఘ సంస్కర్త "సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు"గా నామకరణం చేశారు. ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు పేరును "అబ్దుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు"గా మారుస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఇకపై ఈ నూతన పేర్లతోనే పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.



## ధర్మారం ఎస్సైగా ఎంబడి శ్రీకాంత్ బాధ్యతలు

ధర్మారం, ఆగస్టు 28 (ఈవార్తలు): ధర్మారం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎంబడి శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అఖిలకు బంగారు పతకం



ధర్మారం, ఆగస్టు 28 (ఈవార్తలు): ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న వనం అఖిల రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అండర్–20 హైజంప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. అఖిల ప్రతిభను పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## ఎన్‌టీఏ డైరెక్టర్‌గా ఏపీ కేడర్ ఐఏఎస్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి వి. ప్రసన్న వెంకటేశ్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి లభించింది. కేంద్ర ఉన్నత విద్యాశాఖ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ప్రసన్న వెంకటేశ్ ఐదేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన, గతంలో ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఆయన అందించిన సేవలు సుపరిచితమే. దేశవ్యాప్తంగా వివిధ ప్రవేశ, అర్హత పరీక్షలను నిర్వహించే ఎన్‌టీఏ వంటి కీలక సంస్థకు డైరెక్టర్‌గా నియమితులు కావడం ద్వారా, కేంద్ర ప్రభుత్వం ఆయనకు మరో ముఖ్యమైన బాధ్యతను అప్పగించినట్లయింది. ఏపీ కేడర్ అధికారికి జాతీయ స్థాయిలో ఈ పదవి దక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కంగనా-బాబారాందేవ్.. అన్నాచెల్లి!

న్యూఢిల్లీ: నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, యోగ గురు బాబా రామ్‌దేవ్ మధ్య ఇటీవల తలెత్తిన వివాదానికి ముగింపు పలికే దిశగా ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. రాఖీ పండుగ సందర్భంగా కంగనాను తన సోదరిగా అభివర్ణిస్తూ, ఆమెకు స్వీట్లు, బహుమతులు పంపుతున్నట్లు ప్రకటించారు. సమాజంలో ఎలాంటి విద్వేషాలకు తావులేదని, శత్రుత్వాన్ని వీడాలని ఆయన పిలుపునిచ్చారు. కొద్ది రోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద నిరసనకారులను విమర్శిస్తూ కంగనా రనౌత్ చేసిన 'జనరేషన్ గట్టర్' వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమతో పాటు పలు వర్గాల నుంచి ఆమెపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆ సమయంలో బాబా రామ్‌దేవ్ కూడా కంగనా వ్యాఖ్యలను బహిరంగంగా తప్పుబట్టారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం నడిచింది. ఈ నేపథ్యంలో రాఖీ పండుగను పురస్కరించుకుని రామ్‌దేవ్ శాంతి మంత్రం జపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈరోజు విలేకరులతో మాట్లాడిన బాబా రామ్‌దేవ్.. "మా సోదరి కంగనా రనౌత్‌కు ఈ బహుమతి, మిఠాయిలను పోస్టులో పంపుతున్నాను. దేశంలో ఎలాంటి కారణంతోనూ విద్వేషాలు ఉండకూడదు. ఒకరిపై ఒకరికి శత్రుత్వం వద్దు. అందుకే మేం అన్ని విభేధాలను పూర్తిగా పక్కనపెట్టాం. ఏ వివాదమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. ఈరోజు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు కంగనాకు నేను ఫోన్ కూడా చేస్తాను" అని తెలిపారు.



### ఇండియాకు జావెలిన్

## యాంటీ ట్యాంక్ మిస్సైల్స్

వాషింగ్టన్: ఇండియా-అమెరికా మధ్య రక్షణ సంబంధాలు ఎప్పటినుంచో ఉన్నాయి. అమెరికా తయారు చేసిన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఇతర ఆయుధాల్ని భారత్ కొంటూ వస్తోంది. తాజాగా మరో కొత్త రకం ఆయుధాల్ని అమెరికా నుంచి కొనేందుకు భారత్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అమెరికా నుంచి జావెలిన్ అనే యాంటీ-ట్యాంక్ మిస్సైల్స్‌ను కొనేందుకు ఇండియా సిద్ధమవుతున్నట్లు ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా శుక్రవారం ప్రకటన చేశారు. ఇండియా కూడా సొంతంగా క్షిపణులు తయారు చేస్తోంది. అయినప్పటికీ, అమెరికా రూపొందించిన జావెలిన్ భిన్నమైంది. ఇది పోర్టబుల్ యాంటీ-ట్యాంక్ మిస్సైల్. దీన్ని అమెరికాకు చెందిన లాఖీడ్ మార్టిన్, ఆర్టీఎక్స్ సంస్థలు సంయుక్తంగా రూపొందించాయి. అమెరికాతోపాటు మిత్ర దేశాలు ఇప్పటికే వీటిని భారీ తరహాలో కలిగి ఉన్నాయి. అంతేకాదు.. పలు యుద్ధాల్లో కూడా వినియోగించాయి. విజయవంతమైన మిస్సైల్స్‌గా వీటికి పేరుంది. ఇది చాలా తేలికైన క్షిపణి. దీన్ని నేరుగా భుజంపై నుంచి ప్రయోగించవచ్చు. ఇది ఆటోమేటిక్ గైడెన్స్ మెకానిజం కలిగి ఉంది. దీన్ని లాంచ్ చేయగానే టార్గెట్‌ను ఛేధించగలదు. వీటిని ఒకసారి ప్రయోగించిన తర్వాత సైనికులు శత్రువులకు చిక్కకుండా మళ్లీ రహస్యంగా రక్షించుకోవచ్చు. దీన్ని బిల్డింగులు, బంకర్ల నుంచి కూడా తేలికగా ప్రయోగించవచ్చు. ఈ జావెలిన్ క్షిపణుల్ని కొనుగోలు చేయడం ద్వారా ఇండియా-అమెరికా మధ్య సైనిక సహకారం మరింత బలపడుతుందని సెర్గియో గోర్ అభిప్రాయపడ్డారు. ఇండియాకు విక్రయించబోయే మిస్సైల్స్ డీల్ 93 మిలియన్ డాలర్లుగా ఉంది. దీని ప్రకారం 100 వరకు జావెలిన్ సిస్టమ్స్, 216 ఎక్స్‌క్యాలిబర్ గైడెడ్ అర్టిల్లరీ ప్రొజెక్టైల్స్‌ను ఇండియాకు విక్రయించనున్నారు.

## నిప్పుతో చెలగాటం వద్దు:

## బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

మాస్కో: ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలనూ అవకాశం ఉంది. ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

## టికెట్ లేకుండా 13 వేల మంది ప్రయాణం

సికింద్రాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): టికెట్ లేకుండా రైలు ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల పట్ల దక్షిణ మధ్య రైల్వే దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు ముమ్మరంగా టికెట్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు సౌత్ సెంట్రల్ రైల్వే వ్యాప్తంగా జరిగాయి. కేవలం టికెట్ లేకుండా ప్రయాణించిన వారికే మాత్రం కాకుండా.. బుక్ చేయని లగేజీని తీసుకెళ్లే వారిని కూడా గుర్తించి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. 13,964 మంది ప్రయాణికులు టికెట్ లేకుండా ప్రయాణించినందుకు గానూ రూ. 1.28 కోట్ల జరిమానాలు విధించారు. 1,189 మంది ప్రయాణికులు బుక్ చేయకుండా లగేజీ తీసుకెళ్లినందుకు జరిమానా విధించారు. రైల్వే ప్రాంగణాలను అపరిశుభ్రం చేసినందుకు గానూ 37 మందిని గుర్తించి రూ. 6400, గుర్తింపు పొందని ఐదుగురు విక్రయదారులను గుర్తించి రూ. 10 వేలు, రైల్లో స్మోకింగ్ చేసినందుకు ఏడుగురికి రూ. 14 వేలు జరిమానా విధించారు.

# 579కి చేరిన నేపాల్ మృతులు



ఖట్మండు: నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## మళ్లీ వరద..

### ప్రజలకు నేపాల్ హెచ్చరికలు

టిబెట్‌లో డ్యామ్ లీకేజీ అయ్యింది. ఈ నేపథ్యంలో నేపాల్ హెచ్చరిక జారీ చేసింది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ ఆదేశాలు ఇచ్చింది. బుధవారమే భారీ బురదతో కూడిన వరద .. విలయాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. అయితే టిబెట్ ప్రాంతంలో తాత్కాలిక సరస్సు ఏర్పడిందని, అది ఏ క్షణమైనా పగిలే ఛాన్సు ఉన్నట్లు చైనా హెచ్చరించిన విషయం తెలిసిందే. బుధవారం సంభవించిన జలప్రళయం మృతుల సంఖ్య 469కి చేరుకున్నది. తాత్కాలిక సరస్సు ఏర్పడిన ప్రదేశ వీడియోలను సీసీటీవీ రిలీజ్ చేసింది. బుధవారం కొట్టుకుపోయిన గిరాంగ్ పోర్టుకు 10 కిలోమీటర్ల ఎగువన ఆ సరస్సు ఉన్నట్లు తెలిసింది. అక్కడ సుమారు రెండు మిలియన్ల క్యూబిక్ మీటర్ల నీరు ఉన్నది. ప్రస్తుతం ఆ బేరియర్ లేక్ నుంచి నీరు లీకు అవుతోందని, ఏ క్షణమైనా భారీ వరద ముంచెత్తే ప్రమాదం ఉన్నట్లు చైనా చెబుతోంది. దీంతో టిబెట్‌లో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేశారు. రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమైన పోలీసులు, సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ నేపాలీ పోలీసులు సోషల్ మీడియాలో ప్రకటన చేశారు.



## టాక్సిక్ పిల్లలు చూస్తే పరిస్థితి ఏంటి?

### సినిమాపై అన్నామలై ఫైర్



చెన్నై: రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వచ్చిన 'టాక్సిక్' చిత్రం విడుదలైన ఒక్కరోజులోనే ఏకంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే, ఈ సినిమాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినిమాలో మితిమీరిన హింస, మహిళలను కించపరిచేలా ఉన్న సీన్లపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ చిత్రంపై వీ ద లీడర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, తమిళనాడు బీజేపీ మాజీ నేత కే అన్నామలై తీవ్రంగా స్పందించారు. ఈ సినిమా ఒక్క రోజులోనే రూ.104 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. ఇందులో మహిళలను అతిగా లైంగికంగా చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఒకే కోణంలో చూపించే ఇలాంటి సినిమాలను పిల్లలు చూస్తే అది వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న సమయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఇలాంటి చిత్రాలకు ఎలా అనుమతి ఇస్తోంది..? అంటూ ప్రశ్నించారు. సినిమాల్లో మహిళలను గౌరవించే విధానం ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సినిమాల్లో విపరీతమైన హింస, మహిళలను కించపరిచేలా చూపించడం వంటి అంశాలపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ వ్యవహరిస్తున్న తీరును అన్నామలై తీవ్రంగా తప్పుపట్టారు. నిబంధనలను కఠినతరం చేయాలని అభిప్రాయపడ్డారు. పెద్ద నటుల చిత్రాలైనా సరే.. ఏ సన్నివేశాలు అనుమతించాలో సెన్సార్ బోర్డు నిర్ణయించాలన్నారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ సన్నద్ధం

**అహ్మదాబాద్‌లో అమిత్ షా సమీక్ష**

**ఒలింపిక్స్ 2036 బిడ్‌పైనా చర్చ**

అహ్మదాబాద్, ఆగస్టు 28 (ఈవార్తలు): 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ నిర్వహణకు భారత్ సన్నాహాలు ముమ్మరం చేస్తోంది. 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్ చేస్తున్న బిడ్‌పైనా కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష నిర్వహించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, గుజరాత్ ఉపముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ హాజరయ్యారు. అంతర్జాతీయ క్రీడా పోటీలకు భారత్‌ను ప్రపంచ స్థాయి క్రీడా వేదికగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్, 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించినట్లు తెలిపారు. 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చించినట్లు వెల్లడించారు. 2010లో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ తర్వాత.. 2030లో భారత్ మరోసారి ఈ క్రీడా సంబరాలకు ఆతిథ్యమివ్వనుంది. అహ్మదాబాద్‌లో ఈ పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు అవసరమైన మౌలిక వసతులు, భద్రత, రవాణా, ఇతర లాజిస్టిక్ ఏర్పాట్లపై దృష్టి సారించారు. కామన్వెల్త్ గేమ్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణలో భద్రత, లాజిస్టిక్స్ అంశాల్లో కేంద్ర హోంశాఖ కీలకంగా వ్యవహరించనుంది.

## జియో ఐపీవోకి సెబీ గ్రీన్ సిగ్నల్

**సుమారు రూ. 37,700 కోట్లు సమీకరించడమే లక్ష్యం**

ముంబై: దేశీయ కార్పొరేట్ రంగం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు మార్గం సుగమమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (సెబి) శుక్రవారం (ఆగస్టు 28న) తుది ఆమోదం తెలిపింది. ఈ అనుమతి లభించడంతో నిధుల సమీకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు కంపెనీకి లైన్ క్లియర్ అయింది. ఈ ఐపీవో ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 37,700 కోట్లు) సమీకరించాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం నెరవేరితే, ఇటీవలే వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఐపీవో (రూ. 27,000 కోట్లు)ను అధిగమించి, భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఇది రికార్డు సృష్టిస్తుంది. ఈ ఐపీవో కోసం జియో ప్లాట్‌ఫామ్స్ జూన్ నెలలోనే సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ సుమారు 27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. దీనివల్ల కంపెనీ మొత్తం ఈక్విటీలో 2.9 శాతం వాటా విక్రయానికి రానుంది. గత కొన్నేళ్లుగా మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు జియో ఐపీవో కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 2020లోనే జియో ప్లాట్‌ఫామ్స్‌లో మెటా (ఫేస్‌బుక్) రూ.43,574 కోట్లు, గూగుల్ రూ.33,737 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి. వీటితో పాటు మరికొన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి కూడా కంపెనీ భారీగా నిధులను సమీకరించింది.




వయ్యారి చిత్రం



అనుపమ పరమేశ్వరన్

# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో రష్మిక





గత కొన్ని సంవత్సరాలుగా తెరపై పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు, క్రీడారంగాలకు చెందిన గొప్ప వారి బయోపిక్ లు తెరపై దర్శనం ఇస్తున్న విషయం తెలిసిందే. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత కథలు మళ్ళీ తెరపై కదలాడుతూ.. వారికి జీవం పోస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎంతోమంది దివంగత సెలబ్రిటీల బయోపిక్ లు ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా వారికి తెలియని ఎన్నో విషయాలను అందరికీ తెలియజేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఒకప్పుడు తన అద్భుతమైన సంగీతంతో, గాత్రంతో శ్రోతలను అలరించిన లెజెండ్రీ సింగర్ ఎం.ఎస్.సుబ్బలక్ష్మి బయోపిక్ రాబోతోంది అంటూ గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. పైగా తెరపైకి కొంతమంది హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి. కానీ ఇప్పుడు ఎట్టకేలకు ఒక స్టార్ హీరోయిన్ ని మేకర్స్ ఫైనల్ చేశారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్న సమాచారం ప్రకారం.. ఎం.ఎస్. సుబ్బలక్ష్మి బయోపిక్ లో ప్రముఖ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న లీడ్ రోల్ పోషిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ కథకు సంబంధించిన చర్చలు కూడా పూర్తయ్యాయట. జెర్సీ, మళ్ళీరావా, కింగ్ డమ్ లాంటి ఎమోషనల్ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్ ను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం.. నిజానికి ఈ సినిమాలో ఎం.ఎస్.సుబ్బలక్ష్మి పాత్ర ఎవరు చేస్తే బాగుంటుందని తర్జనభర్జన పడ్డారట మేకర్స్. పైగా సాయి పల్లవి అయితే బాగుంటుందని కూడా ఆలోచించారట. కానీ ఆమె ప్రస్తుతం హిందీ రామాయణ సినిమాలో బిజీగా ఉండడంతో ఈ పాత్ర నుండి వైదొలిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రష్మిక మందన్నాను సంప్రదించగా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



# కల్యాణికి సెలవు లేదు!

సౌత్ – నార్త్ సినీ పరిశ్రమలలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి కళ్యాణి ప్రియదర్శన్. ప్రస్తుతం అమ్మడు వృత్తిగత జీవితంలో బిజీగా గడుపుతున్నారు. కేరళలో అత్యంత వైభవంగా జరుపుకునే సాంప్రదాయ పండుగ ఓనం వేడుకలను ఈసారి అమ్మడు మిస్ కావాల్సి వచ్చింది. పండుగ రోజుల్లో కూడా ఇంటికి దూరంగా ముంబైలో షూటింగ్‌లో పాల్గొనడంతో అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ హీరోగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న తాజా పాన్ ఇండియా చిత్రం ప్రళయ్. ఇందులో హీరోయిన్‌గా కల్యాణి నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్‌లో కళ్యాణి ప్రియదర్శన్ పాల్గొంటున్నారు. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్ క్యాలెండర్ ప్రకారం ప్లాన్ చేయబడటంతో పండుగ సెలవులను సైతం పక్కన పెట్టి అమ్మడు ప్రాజెక్ట్‌కు పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రతిఏటా కుటుంబంతో కలిసి ఘనంగా ఆస్వాదించే ఓనం సద్య విందును ఈసారి తాను కోల్పోయానని కళ్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి దూరంగా ఉంటూ పండుగను మిస్ అవుతున్నా.. అద్భుతమైన ప్రాజెక్ట్‌లో భాగం కావడం పట్ల సంతృప్తిగా ఉన్నానని తెలిపారు.

# భోగి నుంచి స్పెషల్ పోస్టర్




నేడు రక్షాబంధన్ కావడంతో పలువురు సెలబ్రిటీలు తమ తోబుట్టువులకు రాఖీ కడుతూ ఈ పర్వదినాన్ని సంతోషంగా సెలబ్రేట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. అటు సినిమాలో కూడా పోస్టర్లను వదులుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న శర్వానంద్ తాజాగా నటిస్తున్న చిత్రం భోగి. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా పై ఇప్పటికే ఎన్నో అంచనాలు నెలకొన్నాయి పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా రక్షాబంధన్ పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. గ్రామీణ నేపథ్యంలో కనిపిస్తున్న శర్వానంద్ లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. తాజాగా రక్షాబంధన్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో శర్వానంద్ తన ఐదుగురు సోదరీమణులతో కలసి కనిపించారు. చుట్టూ తాటి చెట్లు.. మట్టి ఇల్లు.. పల్లెటూరి వాతావరణంలో అన్నయ్య తాటి ముంజలు కొట్టిస్తుంటే.. చేతి ముని వేళ్ళతో చెల్లెళ్లు ఎంతో ఇష్టంగా తింటున్నట్టు ఒక పోస్టర్ విడుదల చేసారు.

# కియారా ఆస్తులు 41 కోట్లు




అందాల తార కియారా అద్వానీ గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. ఇటీవేల అమ్మడు నటించిన టాక్సిక్ కూడా రిలీజ్ అయింది. ఈ సినిమాకు గాను కియారా భారీగానే ఛార్జ్ చేసింది. కంటెంట్ బోల్డ్ గా ఉండటంతో అందుకు తగ్గట్టే డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగావ్యక్తిగత సంపద.. రెమ్యునరేషన్ .. వ్యాపార ప్రకటనల సంపాదనకు సంబంధించిన వివరాలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. కియారా అద్వానీ మొత్తం నికర విలువ 41 కోట్లుగా ఉంటుందని అంచనా. సినిమాలలో నటిస్తూనే, బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. ఫ్యాషన్, బ్యూటీ, జ్యువెల్లరీ, ఫిన్‌టెక్, లైఫ్‌స్టైల్ వంటి అనేక రంగాలకు చెందిన జాతీయ స్థాయి బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కియారా ఆస్తులను గణనీయంగా పెంచుకుంటున్నారు. సినిమాల విషయానికి వస్తే కియారా అద్వానీ ఒక్కో ప్రాజెక్ట్‌కు భారీ స్థాయిలో పారితోషికం అందుకుంటున్నారు. నివేదికల ప్రకారం ఆమె సినిమా బడ్జెట్ .. పాత్ర ప్రాధాన్యతను బట్టి ఒక్కో సినిమాకు 5 కోట్ల నుంచి 8 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు సమాచారం. కబీర్ సింగ్, షేర్షా, భూల్ భులయ్యా 2 వంటి వరుస బ్లాక్‌బస్టర్ హిట్ల తర్వాత అమ్మడి మార్కెట్ వాల్యూ అమాంతం పెరిగింది. బాలీవుడ్‌కే పరిమితం కాకుండా సౌత్ ఇండస్ట్రీలోనూ అగ్ర హీరోల సరసన నటిస్తూ పాన్ ఇండియా రేంజ్‌లో హవాను చాటుకుంటున్నారు.



# దీపిక మాటలు జాగ్రత్త!

తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు.

# కనిపించని భాగ్య శ్రీ



అతి తక్కువ సమయంలోనే భారీ క్రేజ్ సంపాదించుకున్న కథానాయికలలో భాగ్యశ్రీ బోర్సే ఒకరు. గ్లామర్ ..నటనతో తొలి సినిమా నుంచే ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన భామ, ఒకానొక దశలో వరుస అవకాశాలతో ఎంతో బిజీగా కనిపించింది. అంతకుముందు ఒక సినిమా సెట్స్‌పై ఉ ండగానే మరొక క్రేజీ ప్రాజెక్ట్ చేతిలో ఉండేది. అయితే ప్రస్తుతం టాలీవుడ్ లైనప్‌లో భాగ్యశ్రీ పేరు పెద్దగా వినిపించకపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల విడుదలైన లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా అందులో భాగ్యశ్రీ నటనకు మంచి మార్కులే పడ్డాయి. సినిమా విజయం సాధించిన తర్వాత సాధారణంగా కథానాయికలకు కొత్త ఆఫర్ల వరద పారుతుంటుంది. కానీ లెనిన్ తెచ్చిన పాజిటివ్ వైబ్ తర్వాత కూడా భాగ్యశ్రీకి తెలుగులో కొత్తగా పెద్దగా అవకాశాలు రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆమె తదుపరి తెలుగు ప్రాజెక్ట్ గురించిన అధికారిక ప్రకటన ఏదీ ఇప్పటివరకు వెలువడలేదు.







# కోచ్, కెప్టెన్ ఫెయిల్

**శ్రీలంకతో రెండో టెస్ట్‌ను డ్రా చేసుకున్న టీమిండియాపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారత్ విజయానికి అడ్డుగా నిలిచిన సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో జట్టు మొత్తం విఫలమైందని మండిపడ్డాడు. ఇదేం కబ్ల్ మ్యాచ్ కాదని, డేటా అనలిస్ట్, కోచ్‌లు ఏ చేస్తున్నారని ప్రశ్నించాడు.**

సోనాల్ దినుషాను ఔట్ చేసే విషయంలో కోచ్‌గా గంభీర్.. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ విఫలమయ్యారని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్ట్‌లో సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమి నుంచి గట్టెక్కింది. మరోవైపు సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను భారత్ చేజేతులా చేజార్చుకుంది. ఆఖరి రోజు ఆటలో నలుగురు బ్యాటర్లను ఔట్ చేయలేక మూల్యం చెల్లించుకుంది.



ఈ మ్యాచ్ ఫలితంపై అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోటీ టీవీ షోలో మాట్లాడిన కైఫ్.. గిల్‌సేనపై ఘాటు విమర్శలు చేశాడు. 'ప్రతీ బ్యాటర్‌కు ఏదో ఒక లోపం ఉంటుంది. ఆ లోపాన్ని కనుగొనడంలో భారత్ విఫలమైంది. నేను కేవలం శుభ్‌మన్ గిల్‌ను మాత్రమే నిందించడం లేదు. సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో బౌలింగ్ విభాగంతో పాటు కోచింగ్ సిబ్బంది దారుణంగా విఫలమైంది. అతను గాలే టెస్ట్‌లోనే సెంచరీ చేశాడు. కాబట్టి అతన్ని ఔట్ చేసేందుకు పకడ్బందీ ప్రణాళికల గురించి చర్చ చేయాలి కదా? ఈ టెస్ట్‌లో వ్యూహాత్మకంగా టీమిండియా బలహీనంగా కనిపించింది. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ చేయలేదు. ఫీల్డింగ్‌ను ఓపెన్‌గా పెట్టారు. ఒక్క డ్రైవ్ షాట్ బాల్ కూడా వేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత డ్రైవ్ బాల్‌తోనే సోనాల్ దినూషాను సారాన్ష్ జైన్ ఔట్ చేశాడు. కానీ ఈ విషయాన్ని భారత బౌలర్లు మరిచిపోయారు. మహమ్మద్ సిరాజ్ ఫుల్ బాల్ వేసినా అతను తెలివిగా వదిలేసాడు. అతను షాట్లు ఆడటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. ఇక ఇదేం క్లబ్ మ్యాచ్ కాదు. ఇంటర్నేషనల్ గేమ్. జట్టులో ఒక వీడియో అనలిస్ట్, డేటా ఎక్స్‌పర్ట్, ఆరు నుంచి ఏడుగురు కోచ్‌లు ఉన్నారు. సోనాల్ దినూషాను ఔట్ చేసే ప్రణాళికలు రచించకుండా వీరంతా ఏం చేస్తున్నారు..? భారత యువ బౌలర్లకు ఇలాంటి పిచ్‌పై ఆడిన అనుభవం లేదు. టెస్ట్‌ల్లో వారు ఐదో రోజు ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు ఇంత సుదీర్ఘంగా ఎక్కువగా జరగవు. దాంతోనే ఏం చేయాలో భారత బౌలర్లకు అర్థం కాలేదు. అంతేకాకుండా సోనాల్ దినుషాను భారత జట్టు పెద్దగా పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది. తొలి టెస్ట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన తర్వాత కూడా సోనాల్ దినూషాను లైట్ తీసుకున్నారు. రెండో మ్యాచ్‌లోనూ అదే పొరపాటు చేశారు. రెండో టెస్ట్‌లో అతను ఒక్క కవర్ డ్రైవ్ బౌండరీ సాధించలేదు. పుల్, స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్ మాత్రమే ఆడాడు. కానీ ఒక్క కవర్ డ్రైవ్ షాట్ ఆడలేదు. అతను ఆ షాట్ ఆడేలా భారత బౌలర్లు కూడా బంతులు వేయలేదు. షార్ట్ పిచ్ బాల్స్ వేసి పరుగులు సమర్పించుకున్నారు.'అని మహమ్మద్ కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు.

## నా సత్తా చూపించా
### దేవ్‌దత్ పడిక్కల్

టెస్టు క్రికెట్‌లో తాను పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. శ్రీలంకతో 1-0తో సిరీస్ గెలవడంలో తన ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏళ్లుగా సాధించిన నిలకడే టెస్టుల్లోనూ రాణించేందుకు ఉపయోగపడిందని చెప్పాడు. సాయి సుదర్శన్ గాయపడటంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ రెండు టెస్టుల్లో 328 పరుగులు చేశాడు. 109.33 సగటుతో రెండు సెంచరీలు సాధించాడు. ఈ సిరీస్‌లో తనకు అవకాశం వస్తుందని తెలిసినప్పటి నుంచే దాని కోసం ఎదురుచూశానని తెలిపాడు. తన సత్తా ఏంటో చూపించేందుకు ఇదే సరైన అవకాశమని భావించానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పెద్ద స్కోర్లు చేసినట్లే టెస్టుల్లోనూ చేయగలిగానని ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ ఇచ్చిన నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతానని అన్నాడు. శ్రీలంకలో వేడి, ఉక్కపోత పరిస్థితులు జట్టుకు సవాలుగా నిలిచాయని పడిక్కల్ చెప్పాడు. పరిస్థితులు అంత సులభంగా లేకపోయినా మొత్తం జట్టు వంద శాతం కష్టపడిందని ప్రశంసించాడు.



## సోనల్ దినుష అద్భుతం

భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ప్రత్యర్థి జట్టులోని ఓ యువ ఆటగాడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంక యువ సంచలనం సోనల్ దినుష అసాధారణ పోరాటపటిమను ప్రత్యేకంగా అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రాగా ముగించిన అతడి ఆటతీరును గంభీర్ మెచ్చుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకున్నప్పటికీ, దినుష ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో గంభీర్ స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్‌కు పట్టుదల, ఓపిక, మానసిక దృఢత్వం చాలా అవసరం. మన కుర్రాళ్లు దానిని ప్రదర్శించారు. అయితే, సోనల్ దినుష అసాధారణ ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు!" అని పేర్కొన్నాడు. కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం ముగిసిన రెండో టెస్టులో, టీమిండియా విజయం అంచున నిలిచింది. అయితే, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఫాలో ఆన్ ఆడుతూ కష్టాల్లో పడిన జట్టును తన అజేయమైన 133 పరుగుల (264 బంతుల్లో) ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితంగా భారత్ 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. అంతకుముందు గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే.



## పంత్‌ను పక్కనపెట్టాలి: అశ్విన్

భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఆటతీరుపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో పంత్ రెండు అర్ధశతకాలతో 168 పరుగులు చేసినప్పటికీ.. అతడి నుంచి తాను ఆశించిన స్థాయి ప్రదర్శన ఇంకా రాలేదని అశ్విన్ వ్యాఖ్యానించాడు. తన యూట్యూబ్ ఛానల్ 'ఆష్ కీ బాత్'లో మాట్లాడిన అశ్విన్.. పరిస్థితులకు అనుగుణంగా ఆడటం టెస్టు క్రికెట్‌లో చాలా ముఖ్యమని పేర్కొన్నాడు. జట్టు అవసరాలను పక్కనపెట్టి రిషభ్ పంత్ ఇలాగే ఆడతాడనే వాదనను అంగీకరించలేనని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో సిడ్నీ, బ్రిస్బేన్ టెస్టుల్లో పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడిన విషయాన్ని అశ్విన్ గుర్తుచేశాడు. అయితే ఆ విజయాల్లో వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్ చేసిన కీలక సహకారాన్ని కూడా మర్చిపోవద్దని అన్నాడు. టెస్టు మ్యాచ్‌ను గెలిపించడానికి 11 మంది ఆటగాళ్ల సమష్టి కృషి అవసరమని, కానీ ఒక తప్పు నిర్ణయం మ్యాచ్‌ను ఓడించగలదని పేర్కొన్నాడు. ఇక పంత్‌కు టీమ్ మేనేజ్‌మెంట్ ఇస్తున్న ప్రత్యేక మద్దతుపైనా అశ్విన్ ప్రశ్నలు లేవనెత్తాడు. 'వన్-జనరేషన్ ప్లేయర్' అంటూ అతడికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వడం సరికాదని అన్నాడు. అలాంటి మద్దతు ఇవ్వాలనుకుంటే యశస్వి జైస్వాల్ వంటి ఇతర ప్రతిభావంతులకూ ఇవ్వాలని సూచించాడు. పంత్ ఇప్పటికే 50 టెస్టులు ఆడిన అనుభవజ్ఞుడని గుర్తుచేసిన అశ్విన్.. ఇక అతడు మరింత బాధ్యత తీసుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నాడు. తన నిర్ణయాల కారణంగానే పంత్ మిగిలిన రెండు ఫార్మాట్లలో స్థానం కోల్పోతున్నాడని పేర్కొన్నాడు.

## లార్డ్స్ గడ్డపై పాక్‌కు అవమానం

ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ జట్టుకు ఘోర అవమానం ఎదురైంది. లార్డ్స్ టెస్ట్‌ను బహిష్కరిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) చేసిన హెచ్చరికలను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) బేఖాతరు చేసింది. పాకిస్థాన్ దిగ్గజ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూను మ్యాచ్ సందర్భంగా ప్రసారం చేయవద్దని, అలా చేస్తే రెండో టెస్ట్ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పీసీబీ ప్రగల్భాలు పలికింది. కానీ ఈ హెచ్చరికలను ఈసీబీ పట్టించుకోలేదు. చివరకు లార్డ్స్ వేదికగా రెండో టెస్ట్ మ్యాచ్ ప్రసారం కాగా.. పాకిస్థాన్ బరిలోకి దిగింది. ఈ మ్యాచ్ లంచ్ బ్రేక్ సమయంలో ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూను స్కై స్పోర్ట్స్ ప్రసారం చేసింది. అయితే ఏం చేయలేక పాకిస్థాన్ జట్టు తమ ఆటను కొనసాగించింది. ఈ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఖాన్ కుమారులు కాసిం, సులేమాన్ ఖాన్‌లు పాకిస్థాన్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. జైల్లో తమ తండ్రిని చంపేందుకు పాకిస్థాన్ ప్రభుత్వ కుట్ర చేస్తుందన్నారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ అథర్టన్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూ.. 18 నిమిషాల పాటు ప్రత్యక్ష ప్రసారమైంది. 'ఇమ్రాన్ ఖాన్ విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందో తెలియడం లేదు. ఆయనను జైల్లో చంపేందుకు కుట్ర చేస్తున్నారు. వీళ్లైనంత కాలం ఆయనను జైలులోనే ఉంచి.. గొంతు నొక్కేయాలని చూస్తున్నారు. చివరిసారి ఆయన మా బంధువులతో మాట్లాడినప్పుడు పరిస్థితి చాలా దాయనీయంగా ఉందని చెప్పారు. జైలులో హత్యకు గురై, మరణించిన ఇతర రాజకీయ ఖైదీల పరిస్థితితో పోల్చారు. రోజంతా ఇమ్రాన్ ఖాన్‌ను గదిలోనే ఏకాంతంగా ఉంచుతున్నారు.'అని కాసిం, సులేమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ఇంటర్వ్యూను ప్రసారం చేయవద్దని స్కై న్యూస్‌ను పీసీబీ సంప్రదించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ప్రసారం చేస్తే.. మ్యాచ్‌ను బహిష్కరిస్తామని హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ ఇంటర్వ్యూ ప్రసారమైనా.. పాక్ ఆటగాళ్లు బరిలోకి దిగారు. పాక్ బెదిరింపులను స్కై స్పోర్ట్స్‌తో పాటు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు పట్టించుకోలేదని తెలుస్తోంది. అవినీతి కేసులో ఇమ్రాన్ ఖాన్ 2023లో అరెస్టైన విషయం తెలిసిందే.






## అండర్-19లో వైభవ్‌కు దక్కని చోటు

ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరగనున్న సిరీస్ కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన అండర్-19 జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత క్రికెట్ దిగ్గజాలైన వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్, రాహుల్ ద్రావిడ్ కుమారుడు అన్వయ్ ద్రావిడ్‌లకు చోటు దక్కడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అయితే, కేవలం 15 ఏళ్లకే సీనియర్ జట్టులో అరంగేట్రం చేసి సంచలనం సృష్టించిన వైభవ్ సూర్యవంశీకి ఈ స్క్వాడ్‌లో స్థానం లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనికి బీసీసీఐకి చెందిన ఒక ప్రత్యేక నిబంధనే కారణం. బీసీసీఐ 2016లో ఒక కీలక నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఒక ఆటగాడు వయసురీత్యా అర్హత ఉన్నప్పటికీ, కేవలం ఒక్క అండర్-19 ప్రపంచకప్‌లో మాత్రమే పాల్గొనాలి. వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే 2026లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ నియమం కారణంగా భవిష్యత్తులో జరిగే మరో ప్రపంచకప్‌కు అతడు అనర్హుడు. అందుకే అండర్-19 ప్రణాళికల నుంచి సెలక్టర్లు అతడిని పక్కనపెట్టారు.

## కుర్రాళ్ల జోరు.. గిల్ ఖుషీ

శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు. సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు. ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# తెలుగులో ఆర్టీఐ ఉత్తర్వులు.. సామాన్యుడికి మేలు

సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం కాదు.. సామాన్యుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. ప్రభుత్వ కార్యాలయాల తలుపులు తట్టే పేదవాడికి, తన సమస్యకు సమాధానం కోసం ఎదురుచూసే రైతుకు, ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకోవాలనుకునే మహిళకు, అవినీతిపై ప్రశ్నించాలనుకునే పౌరుడికి ఆర్టీఐ ఒక ప్రజాస్వామ్య అస్త్రం. అయితే, ఆ అస్త్రం నిజంగా ప్రజల చేతికి అందాలంటే ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టాలు, నిబంధనలు ప్రజలకు అర్థమయ్యే భాషలో ఉండాలి. ఆ కోణంలో తెలుగులో ఆర్టీఐ ఉత్తర్వులు జారీ చేయడం సామాన్య ప్రజలకు నిజమైన మేలు చేసే నిర్ణయం. మన రాష్ట్రంలో అత్యధిక ప్రజల వ్యవహార భాష తెలుగు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉన్నతాధికారులకు ఇంగ్లిష్ సులభంగా అర్థమవుతుంది. కానీ సామాన్య పౌరుడి పరిస్థితి ఏమిటి? ఒక ప్రభుత్వ ఉత్తర్వును చదవాలంటే ఇంగ్లిష్ తెలిసిన వ్యక్తి సహాయం తీసుకోవాల్సి రావడం దురదృష్టకరం. సమాచారం హక్కు ప్రజలది అయినప్పుడు, ఆ సమాచారాన్ని అర్థం చేసుకునే భాష కూడా ప్రజలదే కావాలి. ఇప్పటివరకు అనేక ప్రభుత్వ ఉత్తర్వులు, శాఖల మార్గదర్శకాలు ఇంగ్లిష్‌లో ఉండటంతో సామాన్యుడు వాటి అర్థం తెలుసుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డాడు. కొందరు అధికారులు చెప్పిందే నిజమని నమ్మాల్సి వచ్చింది. ఇంకొందరు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చింది. దీంతో సమాచార హక్కు చట్టం లక్ష్యమైన పారదర్శకతకు కొంతవరకు అడ్డంకి ఏర్పడింది. ప్రభుత్వ సమాచారం ప్రజలకు అర్థం కాని భాషలో ఉంటే, అది అందుబాటులో ఉన్న సమాచారంగా ఎలా పరిగణించగలం? తెలుగులో ఆర్టీఐ ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే పరిస్థితి మారుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా ప్రభుత్వ నిర్ణయాలను స్వయంగా చదివి అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది. ఆర్టీఐ దరఖాస్తు ఎలా పెట్టాలి? ఏ శాఖను ఆశ్రయించాలి? ఎంత రుసుము చెల్లించాలి? ఏ సమాచారాన్ని కోరవచ్చు? అప్పీల్ ఎక్కడ చేయాలి? వంటి అంశాలపై స్పష్టత పెరుగుతుంది. ఫలితంగా ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరుగుతుంది. ఇది కేవలం భాషా అంశం మాత్రమే కాదు. ఇది ప్రజాస్వామ్య సాధికారతకు సంబంధించిన అంశం. ప్రజలకు అర్థమయ్యే భాషలో సమాచారం ఇవ్వడం వల్ల ప్రభుత్వ వ్యవహారాలపై ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అధికారులు కూడా జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సమాచారం దాచిపెట్టడం, నిబంధనల పేరుతో ప్రజలను తిప్పుకోవడం కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో అందుబాటులో ఉంటే ఆర్టీఐ కార్యకర్తలు, సామాజిక సంస్థలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల వారికి ఉపయోగం కలుగుతుంది. ఒక పథకానికి ఎవరు అర్హులు? ప్రభుత్వ నిర్ణయం ఏమిటి? నిధులు ఎంత? అమలు బాధ్యత ఎవరిది? వంటి ప్రశ్నలకు స్వయంగా సమాధానాలు వెతికే అవకాశం ఏర్పడుతుంది. అయితే ఇక్కడితో ఆగకూడదు. కేవలం ఆర్టీఐకి సంబంధించిన కొన్ని ఉత్తర్వులను మాత్రమే తెలుగులో పెట్టి చేతులు దులుపుకోవడం సరిపోదు. ప్రభుత్వ శాఖల అన్ని ముఖ్యమైన జీవోలు, నోటిఫికేషన్లు, మార్గదర్శకాలు, పథకాల వివరాలు ప్రజలకు అర్థమయ్యే తెలుగులో అందుబాటులోకి రావాలి. అధికారిక ఇంగ్లిష్ పత్రంతోపాటు సులభమైన తెలుగు అనువాదం తప్పనిసరి చేయాలి. అనువాదాల్లో కూడా అత్యంత జాగ్రత్త అవసరం. ఇంగ్లిష్ పదాలను యథాతథంగా తెలుగులోకి మార్చి, సామాన్యుడికి మళ్లీ అర్థం కాని భాషలో ఉత్తర్వులు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదు. చట్టపరమైన కచ్చితత్వాన్ని కాపాడుతూనే సులభమైన, స్పష్టమైన తెలుగు భాషను ఉపయోగించాలి. గ్రామీణ ప్రజలు కూడా చదివి అర్థం చేసుకునేలా ఉండాలి. సాంకేతిక యుగంలో ఇది మరింత సులభం. ప్రభుత్వ వెబ్‌సైట్లలో తెలుగు విభాగాలను బలోపేతం చేయాలి. జీవోలు, ఉత్తర్వులు, దరఖాస్తు నమూనాలు, ఆర్టీఐ మార్గదర్శకాలు అన్నీ ఒకే వేదికపై సులభంగా అందుబాటులో ఉంచాలి. మొబైల్ ఫోన్ ద్వారా కూడా సులభంగా చూసుకునే సౌకర్యం కల్పించాలి. భాష ప్రజలకు అర్థమైతేనే ప్రభుత్వం ప్రజలకు దగ్గరవుతుంది. సమాచారం ప్రజలకు అందితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఆర్టీఐ ఉత్తర్వులను తెలుగులో అందుబాటులోకి తేవడం ఆ దిశగా ఒక సానుకూల అడుగు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు తెలియాలి. తెలిసిన నిర్ణయాలు అర్థం కావాలి. అర్థమైనప్పుడే వాటిపై ప్రశ్నించే హక్కు, చర్చించే అవకాశం, జవాబుదారీతనాన్ని కోరే ధైర్యం ఏర్పడుతుంది. సమాచారం ప్రజల హక్కు అయితే.. ఆ సమాచారాన్ని ప్రజల భాషలో ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. అందుకే తెలుగులో ఆర్టీఐ ఉత్తర్వులు కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదు.. సామాన్యుడిని ప్రభుత్వ పాలనలో భాగస్వామిని చేసే ప్రజాస్వామ్య సంస్కరణ.



# ఖాకీకి చట్టం వర్తించదా?

**చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే సామాన్యుడి పరిస్థితి ఏమిటి? నేరస్థుడిని అదుపులోకి తీసుకోవడం పోలీసుల బాధ్యత. కానీ అదుపులో ఉన్న వ్యక్తిపై నడిరోడ్డుపై దాడి చేయడం, ప్రజల ముందే ప్రతాపం చూపించడం, విచారణకు ముందే శిక్ష అమలు చేయడం ఏ చట్టం చెబుతోంది? కోదాడలో సీఐ వ్యవహరించిన తీరుపై తలెత్తుతున్న ప్రశ్నలు ఇవే. ఖాకీ యూనిఫాం అధికారానికి గుర్తు కావచ్చు. కానీ ఆ అధికారం అపరిమితం కాదు.**

పోలీసు అధికారం రాజ్యాంగం, చట్టాలు నిర్దేశించిన పరిధిలోనే ఉండాలి. నేరం చేశాడన్న అనుమానం ఉన్న వ్యక్తిని పట్టుకోవచ్చు. కేసు నమోదు చేయవచ్చు. విచారణ చేయవచ్చు. కోర్టులో హాజరుపరచవచ్చు. నేరం రుజువైతే శిక్ష విధించేది న్యాయస్థానం. కానీ "పోలీసే దర్యాప్తు చేస్తాడు.. పోలీసే తీర్పు చెబుతాడు.. పోలీసే శిక్ష అమలు చేస్తాడు" అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు అర్థమేంటి? పట్టపగలే నడిరోడ్డుపై తమ ప్రతాపాన్ని చూపించడం కొందరు పోలీసు అధికారులకు అలవాటుగా మారుతోందన్న విమర్శలు కొత్తవి కావు. చేతిలో లాఠీ, వెనుక సిబ్బంది, ఎదుట నిస్సహాయ వ్యక్తి ఉంటే అధికారాన్ని ప్రదర్శించడం సులభం. కానీ అదే చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయడమే అసలైన పోలీసింగ్. బలహీనుడిపై ప్రతాపం చూపించడం కాదు.. బలవంతుడి ముందు కూడా చట్టాన్ని నిలబెట్టడమే నిజమైన ధైర్యం. కోదాడలో జరిగిన ఘటనను కూడా ఈ కోణంలోనే చూడాలి. ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి తప్పు చేసి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. అందుకు పోలీసులకు పూర్తి అధికారాలు ఉన్నాయి. కానీ శిక్షించడానికి, అవమానించడానికి, దౌర్జన్యం చేయడానికి ఎవరు అధికారం ఇచ్చారు? నడిరోడ్డుపై జరిగే పోలీసు దాడులు చట్టంపై ప్రజల విశ్వాసాన్ని పెంచవు. భయాన్ని మాత్రమే పెంచుతాయి. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడకూడదు. తమ సమస్యను చెప్పుకోవడానికి సంకోచించకూడదు. కానీ కొందరు అధికారుల అతివాద ప్రవర్తన వల్ల మొత్తం పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది. ఒక వ్యక్తి చేసిన తప్పుకు మొత్తం శాఖను నిందించడం సరికాదు. అదే సమయంలో తప్పు చేసిన పోలీసు అధికారిని వెనకేసుకురావడం కూడా అంతకంటే ప్రమాదకరం. ఇలాంటి ఘటనల్లో తరచుగా వినిపించే మాట.. "పరిస్థితుల కారణంగా జరిగింది." అయితే చట్టం కూడా పరిస్థితులను బట్టి మారిపోతుందా? సామాన్యుడు చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసే వ్యవస్థ, అదే చట్టాన్ని అధికారి ఉల్లంఘిస్తే ఎందుకు మౌనంగా ఉండాలి? ఖాకీ ధరించినంత మాత్రాన చట్టానికి అతీతులవుతారా? అనే ప్రశ్నకు ప్రభుత్వ యంత్రాంగం సమాధానం చెప్పాలి. పోలీసులకు క్లిష్టమైన పరిస్థితులు ఎదురవుతాయి. నేరస్తులు ఎదురు తిరుగుతారు. ప్రజల ఒత్తిడి ఉంటుంది. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది. ఇదంతా వాస్తవమే. కానీ ఎంతటి ఒత్తిడి ఉన్నా చట్టాన్ని ఉల్లంఘించే హక్కు ఎవరికీ ఉండదు. ఎందుకంటే పోలీసులు చట్టాన్ని అతిక్రమిస్తే, చట్టాన్ని గౌరవించాలని ప్రజలను అడిగే నైతిక హక్కు ఎలా ఉంటుంది? కోదాడ ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించాలి. వీడియోలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలి. తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకోవాలి. కేవలం శాఖాపరమైన విచారణ పేరుతో కాలయాపన చేయకుండా, నిజానిజాలను ప్రజల ముందుంచాలి. బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారికి తగిన జవాబుదారీతనం ఉండాలి. ఇక్కడ ఒక విషయం స్పష్టం.. నేరస్థుడిని సమర్థించడం కాదు. నేరం చేసిన వ్యక్తికి చట్టం ప్రకారం కఠిన శిక్ష పడాలి. కానీ శిక్ష విధించే అధికారం కోర్టులకు ఉంది.. నడిరోడ్డుపై పోలీసులకు కాదు. చట్టాన్ని కాపాడాల్సినవారే చట్టాన్ని ఉల్లంఘించడం ప్రారంభిస్తే, అది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా మిగలదు. వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. నేడు ఒకరిపై.. రేపు ఇంకొకరిపై.. చివరకు పోలీసు అధికారం అదుపు తప్పే ప్రమాదం ఉంటుంది. అందుకే ఖాకీకి కూడా హద్దులు ఉండాలి. అధికారానికి కూడా జవాబుదారీతనం ఉండాలి. పోలీసు చేతిలో లాఠీ ఉందంటే చట్టం అతడి చేతిలో ఉన్నట్లు కాదు. కోదాడ ఘటన నుంచి స్పష్టమైన సందేశం వెళ్లాలి.. "చట్టం ప్రజలకే కాదు.. పోలీసులకు కూడా వర్తిస్తుంది!" అని.

**- వీరనరసింహులు, సూర్యాపేట**

**పండుగ అంటే ప్రజలకు ఆనందం. కుటుంబ సభ్యులతో కలుసుకునే సందర్భం. బంధాలను పంచుకునే వేళ. కానీ అదే పండుగలను ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రయాణికుల జేబులు ఖాళీ చేసే అవకాశంగా మార్చుకోవడం ఎంతవరకు సమంజసం? సామాన్యుడు ఏం చేయగలడన్న నిర్లక్ష్యంతో, ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడం అసలు ప్రజాసేవేనా? లేక ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న పగటి దోపిడీయా? ప్రైవేటు ట్రావెల్స్ పండుగల సమయంలో చార్జీలు పెంచితే ప్రభుత్వాలు మండిపడతాయి.**



# ప్రయాణికుడిపై ఆర్టీసీ పండుగ శిస్తు

ప్రయాణికులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తాయి. కానీ ప్రభుత్వ రవాణా సంస్థలే అదే పని చేస్తే దానికి ఏ పేరు పెట్టాలి? స్పెషల్ సర్వీసుల పేరిట టికెట్‌పై అదనపు భారం వేయడం ప్రజల దృష్టిలో న్యాయమేనా? ప్రభుత్వ బస్సులో ప్రయాణిస్తున్నామన్న భరోసాతో వెళ్లే ప్రయాణికుడికి చివరికి ఎదురయ్యేది అదనపు చార్జీల బాదుడే! ప్రయాణికుడు పండుగకు ఇంటికి వెళ్లడం విలాసం కాదు. అది అతడి అవసరం. ఉద్యోగం, ఉపాధి, చదువు కోసం ఊరికి దూరంగా ఉన్నవారు పండుగ సమయంలో కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడం సహజం. ఈ అవసరాన్ని ఆసరాగా చేసుకొని అదనపు చార్జీలు వడ్డించడం అంటే ప్రజల భావోద్వేగాలపైనే వ్యాపారం చేయడమే. చేతిలో ఉన్న కొద్దిపాటి డబ్బుతో కుటుంబాన్ని కలుసుకోవడానికి బయలుదేరిన సామాన్యుడి జేబుకు చిల్లులు పెట్టడం ప్రభుత్వ బాధ్యతాయుత పాలన ఎలా అవుతుంది? రవాణా సంస్థలు చెబుతున్నట్లుగా పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడపడానికి అదనపు ఖర్చులు వస్తే, ఆ భారాన్ని మొత్తం ప్రయాణికులపై ఎందుకు మోపాలి? ప్రభుత్వ సంస్థకు ప్రజా సేవ కూడా బాధ్యత కాదా? పండుగ సమయంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందించడం ప్రభుత్వ కర్తవ్యం. కానీ అదే సమయాన్ని ఆదాయార్జనకు అవకాశంగా చూడటం ప్రజా రవాణా వ్యవస్థ లక్ష్యానికే విరుద్ధం. సామాన్యుడి ఆదాయం పెరిగిందా? నిత్యావసరాల ధరలు తగ్గాయా? పెట్రోల్, డీజిల్ భారాలు తగ్గాయా? విద్య, వైద్యం, ఇళ్ల అద్దెలు తగ్గాయా? ఒకవైపు ఖర్చులు ఆకాశాన్ని అంటుతుంటే, మరోవైపు పండుగల సమయంలో ప్రయాణ చార్జీల మోతతో ప్రభుత్వం ప్రజలకు మరో దెబ్బ కొట్టడం ఏ న్యాయం? అత్యవసర పరిస్థితుల్లో బస్సు ప్రయాణం చేసేవారు చార్జీల గురించి ఆలోచించకుండా తప్పనిసరిగా టికెట్ కొనాల్సిందే. ఇదే ప్రభుత్వ సంస్థల బలం. ప్రజలకు ప్రత్యామ్నాయం లేదని తెలిసి అధిక చార్జీలు వసూలు చేయడం సేవ కాదు. ఎంపిక లేని ప్రయాణికుడి నిస్సహాయతను లాభంగా మార్చుకోవడమే. ఇక్కడ మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడిపి అదనపు ఆదాయం పొందుతున్న ప్రభుత్వ రవాణా సంస్థలు, సాధారణ రోజుల్లో ప్రయాణికులకు ఏ రాయితీ ఇస్తున్నాయి? ప్రజల పన్నులతో నడిచే సంస్థలు లాభాలు వచ్చినప్పుడు ప్రజలకు ప్రయోజనం కల్పించాలి. కానీ ఖర్చుల పేరుతో నష్టాలను ప్రయాణికులపై మోపి, పండుగల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడితే ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రైవేటు వ్యాపారులకు తేడా ఏముంటుంది? ప్రత్యేక బస్సులు అవసరమే. అదనపు సర్వీసులు కూడా అవసరమే. కానీ ప్రత్యేక సర్వీసు అంటే ప్రత్యేక దోపిడీకి లైసెన్స్ కాదు. ప్రభుత్వం ప్రజల కోసం నడిపే రవాణా వ్యవస్థలో చార్జీలు పారదర్శకంగా ఉండాలి. అదనపు చార్జీలు వసూలు చేయాల్సి వస్తే వాటికి సరైన కారణాలను ప్రజలకు వివరించాలి. ఇష్టారాజ్యంగా భారాలు మోపి, పండుగ వచ్చిందంటే చార్జీల పెంపునకు తెరతీయడం మానుకోవాలి. పండుగ రోజుల్లో ప్రయాణికుడి జేబు కోయడం ఆపాలి. స్పెషల్ బస్సుల పేరుతో అదనపు చార్జీల వడ్డనకు ప్రభుత్వం బ్రేక్ వేయాలి. ప్రజా రవాణాను వ్యాపార దృష్టితో కాకుండా ప్రజాసేవా దృష్టితో నడపాలి. లేకపోతే ప్రజల మనసులో ఒక్క ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది.. ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ చేస్తే చర్యలు.. సర్కారు బస్సులు చేస్తే ఆదాయం పెంపా? పండుగలంటే ప్రజలకు ఆనందం కావాలి.. ప్రభుత్వ రవాణా సంస్థలకు ఆదాయ వేట కాదు!



**చుక్కల శ్రీకాంత్**
**నిజామాబాద్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.